క్లుప్తంగా

ఆర్టీసీ ఈడీకి డ్రైవర్ల వినతి

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ నుంచి గ్రేటర్ హైదరాబాద్ జోన్(జీహెచ్‌జెడ్) బదిలీ చేసిన మమ్మల్ని నిలుపుదల చేయాలని కోరుతూ పలువురు డ్రైవర్లు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం ఈడీ పురుషోత్తానికి వినతి అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. రీజియన్‌లో డ్రైవర్లుగా నియామకమైన మేము పదేళ్ల నుంచి మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్లుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల డిపోలోని 25 మంది డ్రైవర్లకు జీహెచ్‌జెడ్ బదిలీపై చేశారని, దీంతో చిన్నజీతాలు ఉన్న మేము, మా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. మా కంటే జూనియర్‌గా ఉన్న డ్రైవర్లను జీహెచ్‌జెడ్‌కు బదిలీ చేయకుండా మమ్మల్ని ఎందుకు పంపిస్తున్నారని వాపోయారు. వెంటనే మా బదిలీలను నిలుపుదల చేసి మాకు న్యాయం చేయాలని కోరారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

నవాబుపేట: మండల కేంద్రంలోని పెద్ద శివాలయంలో ద్వారపాలకుడి నూతన విగ్రహం, నంది, కుమారస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు దేవాలయ పూజారి వైద్యమఠం రామేశ్వరయ్య తెలిపారు. రెండు రోజుల పాటు గురు, శుక్రవారాలు జరిగే విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు. కాగా దేవాలయ అలంకారోత్సవ కార్యక్రమాలు సైతం పూర్తి కావటంతో దాదాపుగా 220 సంవత్సరాల కిందట వెలిసిన పురాతన శ్రీ తిలకేశ్వరస్వామి, కాశీనాథుడి విగ్రహాలకు రుద్రాభిషేకం సైతం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

కోయిల్‌కొండ: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మండలంలోని పారుపల్లి, గార్లపహాడ్, రాంపూర్, దమయాపల్లి గ్రామాల్లో బుధవారం స్థానిక ఎస్‌ఐ శ్రీనయ్య బృందం స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారి మహబూబ్‌నగర్‌కు వెళ్లే రోడ్డు నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్డుకు మధ్యలో ఈ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశామని, దీని ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు.

టీవీల వితరణ

హన్వాడ: మండల పరిధిలోని టంకర ఉన్నత పాఠశాల ప్రాథమికోన్నత పాఠశాలల్లో సర్పంచ్ అచ్చన్న యాదవ్ టీవీలను వితరణ చేశారు. ఆయన కుటుంబికులు ఆదిత్యసాయి, రోహిత్‌లు ఈటీవీలను పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తన సొంత డబ్బులతో పాఠశాల విద్యార్థులకు టీవీలను బహూకరించడం ఎంతో అభినందనీయమని తెలిపారు. ఉపాధ్యాయులు ఇలాంటి అవకాశాలను విద్యార్థులకు చూయించి వారి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. నర్సింగమ్మ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

దేవరకద్ర రూరల్: కౌకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 84 మంది విద్యార్థులకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి ఆల రఘుపతి రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో మండల నాయకులు ఆల్‌ఇన్‌వన్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువులో రాణించాలని సూచించారు. అన్నపూర్ణ, సూజాత, కిష్టన్న పాల్గొన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఈ నెల 15ని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించి ఉత్సవాలు నిర్వహించాలని కోరుతూ ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్‌ను కలిసి వినతి అందజేశారు. సేవాలాల్ మహరాజ్ బోగ్ బండార్ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు పాల్గొనేందుకు అవకాశముంటుందన్నారు. సెలవు దినంగా ప్రకటించేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.పరశురాం నాయక్, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



మిడ్జిల్: మండల కేంద్రంలోని చైతన్య భారతి ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో డీఈఓగా పూజిత, ఎంఈఓగా కీర్తన, హెచ్‌ఎంగా నందిని వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, శ్యాంసుందర్, శివ, శేఖర్, డెవిడ్, కిరణ్మయి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు చేయించాలి



రైతుల పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్

కోయిల్‌కొండ: వ్యవసాయ పంటల వివరాల నమోదును ప్రతిరైతు తప్పనిసరిగా చేయించేలా మండలాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ సూచించారు. బుధవారం మండలంలోని అనంతపూర్‌లో వ్యవసాయ విస్తరణ అధికారులు చేపడుతున్న యాసంగి పంటల వివరాల నమోదును ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులకు తగు సూచనలు చేశారు. వరిలో జింకు దాతులోపం నివారణ కోసం చిలేటెడ్ జింకు 250 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి రామ్‌పాల్, విస్తరణ అధికారులు వరలక్ష్మి, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత

హన్వాడ: పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డీపీఓ వెంకటేశ్వర్లు తెలియజేశారు. బుధవారం మండల కేంద్రంలో ఈజీఎస్ అధికారులతో కలిసి రివ్యూ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పెంచుతున్న నర్సరీలు, నాటిన మొక్కలకు నీటిని పోయడం ఉపాధి పనుల్లో నాణ్యత వేగం పెంచాలని సూచించారు. గ్రామాల వారీగా ఏయే గ్రామాల్లో ఎలాంటి పనులు చేస్తున్నారనే విషయంపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్, ఎంపీఓ. వెంకట్‌రెడ్డి, ఏపీఓ హేమలత, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మొకర్లాబాద్ నర్సరీ పరిశీలన

మహమ్మదాబాద్: నర్సరీల నిర్వహణ సరిగ్గా చూసుకోవాలని జెడ్పీ సీఈఓ జ్యోతి తెలియజేశారు. బుధవారం మండల పరిధిలోని దేశాయిపల్లి, మొకర్లాబాద్ గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వచ్చే వానాకాలం ప్రారంభంలోనే మొక్కలు నాటేందుకు లక్ష్యం మేరకు మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ప్రభుత్వం అధికారులు సూచించిన మేరకు నర్సరీల్లో మొక్కలు పెంచాలని తెలియజేశారు. అనారోగ్యంగా చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు పెంచాలని సూచించారు. ఇప్పటికే నాటిన మొక్కలకు తగిన స్థాయిలో నీటిని అందించాలని తెలిపారు. అలాంటప్పుడే మొక్కలు తగిన స్థాయిలో పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రూపేందర్ రెడ్డి, ఎంపీఓ శంకర్ తదితరులు ఉన్నారు.

వాతావరణానికి అనుగుణంగా సాగు



మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య

జడ్చర్ల: వాతావరణానికి అనుగుణంగా పంటలను సాగు చేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తెలియజేశారు. బుధవారం మండల పరిధిలోని కోడ్గల్ గ్రామ రైతు వేదికలో వర్షాధార వ్యవసాయ స్థితి స్థాపక పథకం కింద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూముల రకాలు, వాతావరణ పరిస్థితులు అంచనా వేసి అందుకు తగినట్లుగా పంటల సాగును ఎంపిక చేసుకోవాలని, సరైన సమయంలో పంటలను సాగుచేసి అధిక దిగుబడి సాధించాలని తెలియజేశారు. సాగు ఖర్చును తగ్గించేందుకు ఆధునిక యాంత్రీకరణ విధానాలను అవలంబించాలని కోరారు. మార్కెట్‌ను అంచనా వేసి డిమాండ్‌కు తగిన పంటలను సాగు చేసేలా కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా అమలు చేస్తున్న వర్షాధార వ్యవసాయ స్థితి స్థాపక పథకం ద్వారా రైతులకు సబ్సిడీపై పలు యూనిట్లను పంపిణీ చేస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు మహదేవప్ప, పరిమళ్‌కుమార్, శ్రీనివాస్, లక్ష్మణ్, జడ్చర్ల ఏడీఏ ఆంజనేయులు, ఏఓ గోపినాథ్, మమత, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

గండేడ్: మండల పరిషత్ కార్యాలయాన్ని సీఈఓ జ్యోతి తనిఖీ చేశారు. బుధవారం ఆమె తన సిబ్బందితో కలిసి గండేడ్ ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించిన అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, ఉపాధిహామీ పథకం వంటి వాటిపై ఆరా తీశారు. దీంతో పాటు క్యాష్‌బుక్, సాధారణ నిధులు, అటెండెన్సు, అభివృద్ధి పనులకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. మండలానికి సంబంధించిన అన్ని వివరాలు క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డికి సూచించారు. ఆమె వెంట జిల్లా పరిషత్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ ఉన్నారు.

గ్రామ కార్మికులకు వేతనాలు పెంచాలి



ధర్నా నిర్వహిస్తున్న గ్రామ కార్మికులు

బాలానగర్: గ్రామ కార్మికులకు వేతనాలు పెంచాలని వారికి నిత్యం అవసరమైన సబ్బులు, నూనెలు, గ్లౌజులు తదితరాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినా.. మండల స్థాయిలో అమలుకు నోచుకోలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం బాలానగర్ మండల పరిధిలోని ఆయా గ్రామాల గ్రామ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించి ఎంపీఓ నజీర్ అహ్మద్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామ కార్మికులకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వడం లేదని, కేవలం వేతనాలు రూ.4,500 నుంచి రూ.5,000 మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. కనీస వేతనం రూ.8,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ నజీర్ అహ్మద్ మాట్లాడారు. త్వరలోనే గ్రామ కార్మికులకు కావాల్సిన సబ్బులు, నూనె, దుస్తులు వంటి కాస్మోటిక్స్ అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు.

పరికరాల అందజేత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు వివిధ పరికరాలు పంపిణీ చేశారు. విధి నిర్వహణలో వారికి కావాల్సిన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోటలో బుధవారం కొందరు అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఎస్‌ఐ భాగ్యలక్ష్మారెడ్డి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన బోయ కృష్ణయ్య, పోగులు రామాంజనేయులు, కావలి అంజిలు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రామ ఊకచెట్టు వాగు నుంచి చుట్టు పక్కల గ్రామాలకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్న సమాచారం వచ్చింది. దీంతో సంఘన స్థలానికి వెళ్లి ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల ఊకచెట్టు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పత్తి రైతులకు మద్దతు ధర చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న రైతులు

దేవరకద్ర రూరల్: పత్తి రైతులకు మద్దతు ధర చెల్లించాలని బుధవారం కౌకుంట్ల మండలంలో అఖిల భారత రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పెరిగిన సాగు ఖర్చులతో పోలిస్తే ప్రస్తుతం ప్రభుత్వం పంటలకు అందిస్తున్న మద్దతు ధర సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాకు రూ.12,000 మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర గ్యారంటీ చట్టం చేయాలన్నారు. స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులు అమలు చేయడంతో పాటు రైతుల రుణాలను రద్దు చేసి, కౌలు రైతులకు రైతుబంధు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శివరాజ్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచందర్, జిల్లా కమిటీ సభ్యుడు కొండరెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సాంబశివుడు, రాజిరెడ్డి, శివరెడ్డి, దశరథ రైతులు పాల్గొన్నారు.

బియ్యం లారీని అడ్డుకున్న గ్రామస్తులు

అడ్డాకుల: మండలంలోని రాచాలకి రేషన్ బియ్యం తీసుకొచ్చిన లారీని గ్రామస్తులు అడ్డుకున్నారు. జడ్చర్ల స్టాక్ పాయింట్ నుంచి రాచాలకి మంగళవారం రాత్రి రేషన్ బియ్యం తీసుకొచ్చిన లారీని గ్రామస్తులు కోట బురుజు వద్ద అడ్డుకున్నారు. పక్క మండలాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తూ.. మన మండలానికి దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారని ఆరోపిస్తూ.. కొద్దిసేపు బియ్యం లారీ ఎదుట గ్రామస్తులు నిరసన తెలిపారు. అక్కడున్న లారీ సిబ్బంది అధికారులకు సమాచారం చేరవేశారు. ప్రస్తుం అన్ని మండలాలకు దొడ్డు బియ్యమే సరఫరా అవుతున్నందున రాచాలకు కూడా దొడ్డు బియ్యమే వస్తున్నాయని అధికారులు ఫోన్‌లో గ్రామస్తులకు నచ్చజెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. లారీలో తీసుకొచ్చిన బియ్యాన్ని రేషన్‌షాపులో దింపి వెళ్లారు.

కరాటే టోర్నీకి తరలిన విద్యార్థులు



విశాఖపట్నానికి తరలిన కరాటే విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సింధు

మహబూబ్‌నగర్ క్రీడలు: విశాఖపట్నంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి ఈ నెల 12 వరకు కొనసాగే మొదటి ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్(సీఎం కప్)కు మహబూబ్‌నగర్ పట్టణంలోని డ్రాగన్ షోటోకాన్ కరాటే దూ ఇండియా విద్యార్థులు ఎంపికైనట్లు మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడు, మాస్టర్ ఎస్‌కే.మోసీన్ తెలియజేశారు. విద్యార్థులు బుధవారం జిల్లా కేంద్రం నుంచి విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మాస్టర్ ఎస్‌కే.మోసీన్ మాట్లాడారు. ఇంటర్నేషనల్ పోటీల్లో మనోవికాస్-25 కేజీ (గ్రీన్ బెల్టు), మహీంధర్-23 కేజీ, సాయినాథ్-28కేజీ (ఆరెంజ్ బెల్టు), సింధూర-32 కేజీ (వైట్ బెల్టు), సాదియ-45 కేజీ (బ్లాక్‌బెల్టు), సాయిప్రియ-38 కేజీ (బ్లూబెల్టు), సాయి అక్షర-26 కేజీ (బ్లాక్‌బెల్టు) విభాగాల్లో పోటీ పడుతున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ కరాటే పోటీలకు వెళ్తున్న విద్యార్థులను డ్రాగన్ షోటోకాన్ కరాటే దూఇండియా ఫౌండర్ సాలం బిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్ అమ్రేష్, మోసీన్ తదితరులు అభినందించారు. ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. వెంకట్రాములు, ఫహీం, అర్బాత్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

నవాబుపేట: జాతీయ స్థాయి కరాటే పోటీలకు మండల కేంద్రానికి చెందిన చాణక్య పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల యాజమాన్యం అభినందించింది. చాణక్య పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సింధూజ ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. కార్యక్రమంలో కరాటే ట్రైనర్స్ సాలంబి, ఎస్‌కే మదన్, పాఠశాల యాజమాన్యం సునిల్ పాటిల్, సందీప్ పాటిల్ ఉన్నారు.

బీకేఎస్ నాయకుల అరెస్టు

మిడ్జిల్: అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ఇతర నాయకులను బుధవారం మండల పరిధిలోని కొత్తపల్లి వద్ద ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచారు. ఈ సందర్భంగా బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే రైతులకు రుణమాఫీ చేయాలని, అలాగే 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రవీందర్ గౌడ్, శేఖర్, మహేంద్రచారి, శ్రీనివాసులు, కృష్ణయ్య, బాల్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆపదలో అండగా ఉంటాం..



బాండ్‌ను అందజేస్తున్న మిత్రులు

దేవరకద్ర రూరల్: స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతమంటూ ఓ సినీకవి రాసిన పాటను అక్షరాల నిజం చేస్తున్నారు కౌకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1992-93 బ్యాచ్ విద్యార్థులు. తమతో పాటు చదువుకున్న వారికి ఆపద వస్తే అందరూ కలిసి అండగా నిలుస్తున్నారు. కౌకుంట్లకి చెందిన అశోక్ వారం రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మిత్రులందరూ కలిసి రూ.50 వేలను పోగుచేసి తమ స్నేహితుడి కుమార్తెపై డిపాజిట్ చేశారు. బుధవారం బాధిత కుటుంబానికి అందుకు సంబంధించిన బాండ్‌ను అందజేశారు. అలాగే 3 సంవత్సరాల కిందట తమ మిత్రుడు కుమార్ మృతిచెందితే మిత్రుడి ఇద్దరి కుమారైల పేరుపై రూ.లక్ష డిపాజిట్ చేసి బాండ్‌లను అందజేశారు. వీటితో పాటు సంవత్సరం కిందట మహబూబ్‌నగర్ జిల్లా, మనికొండలో తల్లిదండ్రులు చనిపోయి అనాథగా మారిన ముగ్గురు ఆడపిల్లలకు రూ.76 వేల ఆర్థిక సాయం అందించారు. ఇక ముందు కూడా తమలో ఎవరికి కష్టం వచ్చినా అందరం అండగా నిలుస్తామన్నారు.

కొనసాగుతున్న సంతకాల సేకరణ

కోయిల్‌కొండ: గార్లపహాడ్ మండలంగా ప్రకటించాలని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులతో మండల సాధన సమితి సభ్యులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని అభంగపట్నంలో బుధవారం కొనసాగించారు. 17 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నామని ప్రభుత్వం వెంటనే స్పందించి మండల ప్రజల కోరికను నెరవేర్చాలని జేఏసీ నాయకులు వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. కోయిల్‌కొండ మండలంలో 44 గ్రామ పంచాయతీలుగా అతిపెద్ద మండలంగా ఉందని, అందులో గార్లపహాడ్‌ను మరో మండలంగా చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆంజనేయులు, రాజు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి

గండేడ్: గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని పంచాంగాల్ తండాలో ఆయన రూ.4.5 లక్షలతో ఏర్పాటు చేసిన మూడు హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అనంతరం తండాలో జరిగిన పూజల్లో పాల్గొని గిరిజనులతో కలిసి నృత్యం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధికి గాను ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. పట్టణాలకు దీటుగా తండాలను తీర్చిదిద్దుతుందన్నారు. ఇందులో భాగంగానే తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి నిధులను కేటాయించిందన్నారు. ఇంతకు ముందు అనుబంధ గ్రామాలుగా ఉండటంతో అభివృద్ధి పూర్తిస్థాయిలో జరగలేకపోయిందన్నారు. నిధులన్నీ పెద్ద గ్రామాలకే పెట్టడంతో తండాల్లో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉండేదన్నారు. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. కొత్త గ్రామపంచాయతీలు ఏర్పాటయ్యాక నిధులు ఆ తండాల్లోనే ఖర్చు చేసుకునే అవకాశం కల్గిందన్నారు. రానున్న రోజుల్లో గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పెంట్యానాయక్ , బాలవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, రాంచందర్, హరిశ్చందర్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూకంప మృతులకు నివాళి



జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐపీఎస్ఓ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: తురికియా, సిరియా భూకంపంలో మృతిచెందిన వారికి సంతాప సూచికంగా బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బుధవారం అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం(ఏఐపీఎస్ఓ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏఐపీఎస్ఓ ప్రతినిధులు మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యంతో తురికియా, సిరియా దేశాల్లో వేలాది మంది పౌరులు మరణించడం అత్యంత విషాధకరమైన సంఘటన అన్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. విశ్వవ్యాప్తంగా మానవాళి ఈ సంఘటనపై స్పందించాలని, ప్రపంచ దేశాలు సంపూర్ణ సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఏఐపీఎస్ఓ ప్రతినిధులు లక్ష్మణ్‌గౌడ్, ఎస్‌ఎం ఖలీల్, హనీఫ్ అహ్మద్, కిష్టయ్య, పద్మ, జలాల్‌పాష, నయన్ సిద్దిఖ్, గాంధీ, ఆమేర్ సోహైల్, కురుమూర్తి, విల్సన్, సురేష్, రాంమోహన్, విజయ్‌కుమార్, మహ్మద్ అబ్బాస్, సంతోష్, జహంగీర్, కృష్ణయ్య, అహ్మద్, షోయబ్, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలి



ఆందోళన చేపడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: వెల్ఫేర్ బోర్డులో వివిధ పథకాల కింద దరఖాస్తు చేసుకున్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాకం రామ్మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రమాదవశాత్తు మరణం, సహజ మరణం, మెటర్నిటీ, మ్యారెజ్ బెనిఫిట్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ రవినాయక్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఆంజనేయులు, తిర్పతయ్య, లక్ష్మణ్‌నాయక్, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గండేడ్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర

గండేడ్: మండలంలో గురువారం నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర ప్రారంభం అవుతుందని ఉమ్మడి గండేడ్ మండల కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి తెలియజేశారు. గురువారం సాయంత్రం 5 గంటలకు గండేడ్ మండల పరిధిలోని కొంరెడ్డిపల్లిలో ఈ యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఈ సందర్భంగా డీసీసీ జిల్లా అధ్యక్షుడు పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. కార్ల ర్యాలీ నిర్వహించడంతో పాటు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగువేస్తారని తెలిపారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు మహమ్మదాబాద్‌లో..

మహమ్మదాబాద్: కాంగ్రెస్ పార్టీ చేపట్టిన హాథ్‌సే హాథ్ జోడో యాత్ర మహమ్మదాబాద్‌లో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలియజేశారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శశికళ అన్నారు. బుధవారం మండలంలోని గార్లపహాడ్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ విజయలక్ష్మి, నాయకులు యాదిరెడ్డి, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 339 మందికి కంటి చికిత్సలు చేసినట్టు వైద్యాధికారి మహమ్మద్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కంచన్‌పల్లి, మహమ్మదాబాద్ గ్రామాల్లో రెండు టీములుగా ఏర్పడి కంటి పరీక్షలు చేయగా.. అవసరం ఉన్న వారికి మందులు ఇచ్చి కంటి అద్దాలను పంపిణీ చేశారు.

'విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం'

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తుంటే విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్లు కనిపిస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరుతూ బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. విద్యారంగానికి బడ్జెట్లో కనీసం 10 శాతం కూడా నిధులు కేటాయించకపోవడం విద్యారంగాన్ని చిన్నచూపు చూడటమే అన్నారు. నామమాత్రంగా బడ్జెట్ కేటాయింపులు చేస్తే రాష్ట్రంలో విద్యారంగం కుంటుపడుతుందన్నారు. అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భరత్, ప్రశాంత్, రాధిక, నందు, మనీష్, శ్రీనాథ్, మల్లేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో ఖాళీలు భర్తీ చేయాలి

పాలమూరు: యూనివర్సిటీల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతున్న ప్రొఫెసర్ కాశీం అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం 9 ఏళ్ల నుంచి యూనివర్సిటీల్లో ఉన్న ఖాళీల భర్తీకి కనీస చర్యలు తీసుకోవడం లేదన్నారు. పాలమూరు యూనివర్సిటీలో ఇద్దరు ప్రొఫెసర్లు మాత్రమే ఉండి, మిగిలిన వారు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు అధ్యాపకులుగా ఉంటే యూనివర్సిటీ అవుతుందా అని ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్సిటీలో విశ్రాంతి పొందిన వారి స్థానంలో కొత్త పోస్టులు భర్తీ చేయకుంటే విద్యార్థులకు పాఠాలు ఎవరు చెబుతారన్నారు.

మన సంస్కృతిని కాపాడుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మన సంస్కృతిని కాపాడుకోవాలని జేపీఎన్‌సీ చైర్మన్ రవికుమార్ అన్నారు. ఈ మేరకు కళాశాలలో ఏర్పాటు చేసిన 'సాంప్రదాయ దినోత్సవాన్ని' పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేల సంవత్సరాల నుంచి దేశంలో ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయని, వాటిని పరిరక్షించుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి



మహబూబ్‌నగర్ రూరల్: అంగన్‌వాడీ వ్యవస్థను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేస్తూ.. టీచర్లు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్సీ కవితను కలిసి వినతి అందజేశారు. 60 ఏళ్లు నిండిన టీచర్లకు రూ.5 లక్షలు, ఆయాలకు రూ.3 లక్షలు అందజేస్తూ.. నెలవారి జీతంలో సగం ఇవ్వాలని కోరారు. ఒకవేళ వారు కోరితే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా ప్రీ స్కూల్ పిల్లలకు రూ.7, గర్భిణులు, బాలింతలకు రూ.10 చొప్పున పెంచుతూ.. ప్రతినెలా వంటగ్యాస్ బిల్లును అకౌంట్‌లో జమ చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



అడ్డాకుల: మూసాపేట మండలం అచ్చాయపల్లిలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను నాణ్యవంతంగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యే విధంగా చూడాలని కోరారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. సర్పంచ్ చంద్రశేఖర్, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.